
సంద్రపు ఒడిలో నిదురించే నగరం.. కొండల చాటున దాగున్న అందం..విశాఖ తీరంలో ఒక దివ్యమైన దృశ్యం.. సీతకొండపై నిలిస్తే పరవశించే హృదయం.. అలల గీతం చెవులకు వినబడుతుంటే.. ప్రకృతి ఒడిలో మనసు తేలియాడుతుంది. ఇక్కడ నిలిస్తే కన్నుల నిండా అనంతమైన నీలి సాగరం.. మనసు నిండా చెప్పలేని ఒక అనిర్వచనీయమైన భావన.. ఇది కేవలం ఒక వ్యూ పాయింట్ కాదు.. ఇది ప్రకృతితో మమేకమయ్యే ఒక అద్భుతమైన అనుభూతి.. రండి.. సీతకొండ అందాలను మీ హృదయంలో నింపుకోండి..

–ఆరిలోవ

సీతకొండ వ్యూ
పర్యాటకుల క్యూ



సీతకొండ వద్ద సీవ్యూ పాయింట్‌లో విద్యుత్ దీపాలతో ఐలవ్ వైజాగ్ బోర్డు



నగరంలో ఆర్‌కే బీచ్, వుడా పార్కు, రుషికొండ, భీమిలి బీచ్‌లు సుపరిచితమే. అయితే, వీటికి దీటుగా జోడుగుళ్లపాలెం సమీపంలోని సీతకొండ వద్ద వైఎస్సార్ సీవ్యూ పాయింట్ కొత్త ఆకర్షణగా నిలుస్తోంది. తొమ్మిదో వార్డు పరిధిలో బీచ్‌రోడ్డులో ఉన్న ఈ ప్రదేశం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ సీవ్యూ పాయింట్‌కు సందర్శకుల తాకిడి రోజు రోజుకూ పెరుగుతోంది. విద్యుత్ దీపాల కాంతిలో ఇక్కడ సందడి వాతావరణాన్ని పర్యాటకులు ఆస్వాదిస్తున్నారు. కొందరు సందర్శకులు ఇక్కడ పుట్టినరోజు వేడుకలు సైతం జరుపుకుంటున్నారు. ప్రతి సాయంత్రం వందల సంఖ్యలో వాహనాలు చేరుకోవడంతో రోడ్డు ఇరువైపులా నిండిపోతోంది. వేల మంది సముద్రపు అలలను చూస్తూ ఆహ్లాదంగా గడుపుతున్నారు. వారాంతాల్లో ఈ ప్రాంతం సందర్శకులతో కిక్కిరిసిపోతోంది. అటుగా వెళ్లే ప్రయాణికులు సైతం ఈ అందాలను చూసి ఆగకుండా ఉండలేకపోతున్నారు.

రూ.3 కోట్లతో

సుమారు రూ. 3 కోట్ల వ్యయంతో ఈ ప్రాంతం సుందరంగా తీర్చిదిద్దారు. సందర్శకుల కోసం ప్రత్యేకంగా పలుకలు పరచి ఫ్లోరింగ్ ఏర్పాటు చేశారు. సముద్రం వైపు రక్షణ గోడలు నిర్మించి, వాటిపై కూర్చొని అలలను వీక్షించేందుకు అనువుగా తీర్చిదిద్దారు. సీవ్యూ పాయింట్ వద్ద ఆకర్షణీయమైన విద్యుత్ దీపాలతో కూడిన 'ఐ లవ్ వైజాగ్' బోర్డు ఏర్పాటు చేశారు. ఈ బోర్డుకు ఇరువైపులా రంగురంగుల విద్యుత్ కాంతులు విరజిమ్ముతున్నాయి. కొండ వైపు బుద్ధుని చిత్రాలు, వివిధ బొమ్మలతో ఆకర్షణీయమైన పెయింటింగ్‌లు వేశారు.

అలలు వీక్షిస్తూ..

పైనుంచి బీచ్‌లోకి దిగడానికి మెట్లు నిర్మించారు. వాటి మధ్యలో పూర్వకాలపు రాళ్ల నడుమ ఉన్న కమ్మల పాకలో కొలువై ఉన్న మడిరిమాంబ అమ్మవారి చిన్న గుడిని పునరుద్ధరించారు. ఆ గుడి చుట్టూ నిర్మించిన వేదికపై సందర్శకులు కూర్చొని సముద్రపు అలల ఉవ్వెత్తున ఎగిసి పడటాన్ని ఆనందంగా తిలకిస్తున్నారు. ఇన్ని సౌకర్యాలతో అభివృద్ధి చెందిన ఈ వైఎస్సార్ సీవ్యూ పాయింట్ ఇప్పుడు సందర్శకులతో కళకళలాడుతోంది.



సీ వ్యూ పాయింట్లో కూర్చొని సముద్రం అలలు తిలకిస్తున్న సందర్శకులు

ఫొటో స్పాట్‌గా..




ఐలవ్ వైజాగ్ బోర్డు వద్ద ఫొటోలు తీసుకుంటూ పిల్లల సందడి

బీచ్ రోడ్డులో సాగర్‌నగర్, భీమిలి నుంచి నగరానికి రాకపోకలు సాగించే వారికి, అలాగే సందర్శకులకు వైఎస్సార్ సీవ్యూ పాయింట్ ఒక అద్భుతమైన ఫొటో పాయింట్‌గా మారింది. సముద్ర మట్టానికి ఎత్తులో ఉండటం, ఆకర్షణీయమైన 'ఐ లవ్ వైజాగ్' బోర్డు, మరోవైపు పచ్చని కొండల అందాలు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ కారణాల వల్లనే ఇక్కడ ఎక్కువ మంది తమ జ్ఞాపకాలను ఫొటోల రూపంలో బంధించడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ పాయింట్ నుంచి తీసే చిత్రాల్లో ఒకవైపు సముద్రపు అలలు, మరోవైపు కైలాసగిరి, తెన్నేటి పార్కు, సాగర్‌నగర్ నుంచి రుషికొండ వరకు విస్తరించి ఉన్న అందమైన దృశ్యాలు తళుక్కుమంటాయి. అందుకే ఇక్కడ ఫొటోలు దిగడానికి సందర్శకులు పోటీపడుతున్నారు.

కొండ అంచున.. సంద్రపు అందం

విశాఖ నగరంలోని ఆర్‌కే బీచ్ నుంచి భీమిలి వెళ్లే బీచ్ రోడ్డులో, జోడుగుళ్లపాలెం దాటి సీతకొండ మలుపు వద్ద ఒక అద్భుతమైన ప్రదేశం ఆవిష్కృతమైంది. వైఎస్సార్ సీవ్యూ పాయింట్. సముద్ర మట్టానికి దాదాపు 30 అడుగుల ఎత్తులో కొండ అంచున ఉన్న ఈ ప్రదేశం నుంచి విశాలమైన సముద్రం కనువిందు చేస్తోంది. గతంలో ఇక్కడ కొద్దిమంది మాత్రమే ఆగి అలల అందాన్ని ఆస్వాదించే వారు. ఈ ప్రాంతాన్ని సందర్శకులకు మరింత చేరువ చేయాలనే సంకల్పంతో 2022లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అప్పటి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ అధికారులు దీని అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. 2023 మార్చిలో నగరంలో జరిగిన జీ-20 సదస్సు సందర్భంగా, జీవీఎంసీ ఆర్‌కే బీచ్ నుంచి భీమిలి వరకు పలు బీచ్ పాయింట్లను అభివృద్ధి చేయగా, సీతకొండ బీచ్‌కు ప్రత్యేక ప్రాధాన్యత లభించింది.



బీచ్ రోడ్డు దిగువున మరిడిమాంబ అమ్మవారి గుడి వద్ద విద్యుత్ కాంతుల మధ్య సేదదీరిన సందర్శకులు



సీవ్యూ పాయింట్‌కు ఇరుపక్కలా విద్యుత్ దీపాలలో సందర్శకుల సందడి..

క్లుప్తంగా

అతిథి అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి వినతి



వినతి పత్రం అందిస్తున్న అతిథి అధ్యాపకులు

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు ఆయన నివాసం వద్ద అతిథి అధ్యాపకుల సంఘం సభ్యులు కలసి మంగళవారం వినతి పత్రం అందించారు. అతిథి అధ్యాపకులకు నెలవారి జీతాలు ఇప్పించాల్సిందిగా కోరారు. ఆదికవి నన్నయ, ఆచార్య నాగార్జున, జేఎన్టీయూ కాకినాడ, ఆదికేసరి విశ్వవిద్యాలయాలు ఇప్పటికే నెలవారీ వేతనాలు ఇస్తున్నాయన్నారు. యూజీసీ నిబంధనల మేరకు ఏ నెల జీతం ఆ నెల్లోనే ఇవ్వాల్సి ఉందన్నారు. వినతి పత్రం అందించిన వారిలో అతిథి అధ్యాపకుల సంఘ నాయకులు డాక్టర్ ఎం.సురేష్ మీనన్, డాక్టర్ విక్రమ్, డాక్టర్ దాస్, డాక్టర్ త్రినాథ్, డాక్టర్ సిరీష్, సురేంద్ర, గిరీష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నేతాజీ పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే, అధికారులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-1లోని నేతాజీ పార్క్‌ను రూ.15 లక్షలతో అభివృద్ధి చేయనున్నారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పార్క్‌లో పిల్లల ప్రాంగణం, వాకింగ్ ట్రాక్స్‌ను ఆధునీకరిస్తామని ఆయన తెలిపారు. జోన్-3 జెడ్సీ శివప్రసాద్, కార్పొరేటర్ లావణ్య పాల్గొన్నారు.

చిన పోలమాంబకు పసుపు కొమ్ముల అలంకరణ



అలంకరణలో చిన పోలమాంబ

మద్దిలపాలెం: పీతలవానిపాలెం, శివాజీపాలెం గ్రామ దేవత చిన పోలమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన మంగళవారం పసుపు కొమ్ముల అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు, గాజులు సమర్పించి, ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శ్రీకృష్ణ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దువ్వి నాగరాజు, బుద్దల కృష్ణ, గౌరవ అధ్యక్షుడు కొర్రాయి రమేష్‌లు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా పోలమాంబ కుంభారాధన



అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తున్న అర్చకులు

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరులో వేంచేసిన 14 గ్రామాల ఆరాధ్య దైవం కరకచెట్టు పోలమాంబ అమ్మవారి నవ కుంభారాధన కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. జాతర మహోత్సవం ముగిసిన నాలుగో మంగళవారం సందర్భంగా తొమ్మిది రకాల ప్రసాదాలను నైవేద్యంగా పెట్టి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

సమస్యలు పరిష్కరిస్తేనే సంతకాలు చేస్తాం

జోన్-2 జెడ్సీతో రామకృష్ణాపురం ప్రజలు



జోన్-2 జెడ్సీ కనకమహాలక్ష్మిని నిలదీస్తున్న రామకృష్ణాపురం గ్రామస్తులు

ఆరిలోవ: జీవీఎంసీ జోన్-2 జెడ్సీ కనకమహాలక్ష్మి టౌన్‌ప్లానింగ్, సచివాలయాల సిబ్బందితో కలసి మంగళవారం 13వ వార్డు పరిధి రామకృష్ణాపురాన్ని సందర్శించారు. ఈ గ్రామంలో ఈకేవైసీ తక్కువగా నమోదైందని, అందరితో ఈకేవైసీ చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. ఇదిలా ఉండగా రెండు నెలల క్రితం గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, రేకుల షెడ్‌లతో ఉన్న ఇళ్లకు శ్లాబ్‌లు వేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కల్యాణ్‌కు 500 మంది లేఖలు రాసిన విషయం తెలిసిందే. దానికి స్పందించిన సీఎం, డీసీఎం ఈ ప్రాంతం ముడసర్లోవ రిజర్వాయరు పరీవాహక ప్రాంతంలో ఉండటంతో శ్లాబ్‌లు వేయడానికి, పట్టాలిచ్చేందుకు అవకాశం లేదంటూ ఎండార్స్‌మెంట్ లెటర్లు గ్రామస్తులకు పంపించారు. మంగళవారం గ్రామాన్ని సందర్శించిన జెడ్సీ ఆ లేఖలపై సంతకాలు చేయాలని గ్రామస్తులను కోరారు. దీంతో వారంతా కలసికట్టుగా ఆమెను చుట్టిముట్టి సమస్యలు పరిష్కారం కానిదే సంతకాలు పెట్టబోమని తెగేసి చెప్పారు. దీంతో ఆమె స్థానికులపై ఆగ్రహం వ్యక్తం చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలంటూ స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు, అధికారులకు మొరపెట్టుకునేందుకు గ్రామస్తులు సిద్ధమవుతున్నారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

ఎంవీపీకాలనీ: మద్దిలపాలెం సంపత్ స్టీల్స్ దరి ఓ ఇంట్లో జరిగిన దొంగతనం కేసులో గొల్లపూడి శ్రీను అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎంవీపీ క్రైమ్ పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులు మీడియాకు మంగళవారం తెలిపిన వివరాలు.. మద్దిలపాలెం సంపత్ స్టీల్స్ ప్రాంతంలో వెలవలపల్లి లక్ష్మీదివ్య కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తోంది. గత నెల 29న ఇంటికి తాళాలు వేసి డ్యూటీకి వెళ్లింది. సాయంత్రం డ్యూటీ నుంచి వచ్చి బీరువా లాకర్ తెరిచి చూడగా రూ.50 వేలు నగదు, 6 తులాల బంగారు అభరణాలు కనిపించలేదు. తొలుత ఇంట్లో వారెవరైనా తీసి, ఎక్కడైనా పెట్టారేమోనని అనుకుంది. అందరినీ ఆరా తీయగా.. తమకెవరికీ తెలియదని చెప్పడంతో, దొంగతనం జరిగినట్లు భావించి ఈ నెల 2న ఎంవీపీ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఈ ఘటనపై ఎస్‌ఐ అప్పలరాజు నేతృత్వంలోని బృందం దర్యాప్తు చేపట్టింది. విజయనగరం కొట్టపాలేనికి చెందిన గొల్లపూడి శ్రీను(35) ఈ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి ఆదుపులోకి తీసుకుంది. అతని నుంచి రూ.30 వేలు నగదు, 6 తులాల బంగారం స్వాధీనం చేసుకుని, కోర్టులో హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

కిశోర బాలికలకు అవగాహన



ఆదర్శనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో రమణికుమారి



నెహ్రూనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలతో అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆరిలోవ: అంగన్‌వాడీ కేంద్రాల్లో పలుచోట్ల కిశోర బాలికలకు మంగళవారం అవగాహన కల్పించారు. జీవీఎంసీ పదో వార్డు పరిధి ఆదర్శనగర్ అంగన్‌వాడీ కేంద్రం, 12 వార్డు పరిధి నెహ్రూనగర్ అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో రమణికుమారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆయా కేంద్రాల్లో బాలికలకు ఆరోగ్యం, పౌష్టికాహారం తదిర అంశాలపై అవగాహన కల్పించారు. కిశోర బాలికలు రుతుక్రమం సమయంలో ఏ విధంగా పరిశుభ్రతతో ఉండాలో వివరించారు. తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి తెలిపారు. కార్యక్రమంలో ఏసీడీపీవో శ్రీలత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్తమాపై అవగాహన తప్పనిసరి

ఆరిలోవ: ఆస్తమా గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని హెల్త్‌సిటీలోని అపోలో హాస్పిటల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ ఆవాల రవిచరణ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆస్తమా పట్ల అపోహలు పెట్టుకోవద్దన్నారు. మన దేశంలో 34 మిలియన్లకు పైగా ఆస్తమా రోగులున్నట్లు పేర్కొన్నారు. ఆస్తమా లక్షణాలను గమనించి, సకాలంలో చికిత్స పొందగలిగే ప్రాణాంతకం కాదన్నారు. తరుచూ దగ్గు, శ్వాస ఆడకపోవడం ఆస్తమా ప్రాథమిక లక్షణాలుగా గుర్తించాలన్నారు. ఇది బాల్యం నుంచే వచ్చే వ్యాధి అని, తరచూ వచ్చే తేలిక పాటి దగ్గును నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఈ వ్యాధితో బాధపడేవారు వ్యాయామానికి దూరంగా ఉండాలని సూచించారు. ఇది అంటు వ్యాధి అని, పొగ, ధూళి కణాల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. ప్రభుత్వాలు కూడా ఆస్తమా నివారణపై దృష్టి పెట్టాలని ఆయన కోరారు.

అందుబాటులోకి రాని మరుగుదొడ్లు

బీచ్‌రోడ్డు : పెదవాల్తేరులోని ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రిలో రోగుల బంధువులు వినియోగించే మరుగుదొడ్ల దుస్థితిపై గతంలో 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మరమ్మతులు చేపట్టారు. అయితే పనులు పూర్తయి చాలా రోజులు గడుస్తున్నప్పటికీ, వాటిని రోగుల బంధువుల వినియోగానికి మాత్రం ఇంకా అందుబాటులోకి తీసుకురాలేదు. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగుల సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి తక్షణమే మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని రోగుల బంధువులు కోరుతున్నారు.

స్టాఫ్ నర్స్ అదృశ్యం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలోని అప్పుఘర్‌కు చెందిన మరుపల్లి సంధ్య అనే స్టాఫ్ నర్స్ అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సంధ్య ఎంవీపీ కాలనీలోని ఓ ఆస్పత్రిలో నర్స్‌గా పనిచేస్తోంది. ఈ నెల 3వ తేదీన ఆమె విధులకు వెళ్లింది. ఆ తర్వాత ఆమె తమ్ముడు వంశీ ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. ఆస్పత్రికి వెళ్లి విచారించగా, ఆమె వచ్చి వెళ్లిపోయినట్లు సిబ్బంది తెలిపారు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో, వంశీ ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి కూలర్ ప్రారంభం



తాగు నీటి కూలర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ప్రజా రవాణాశాఖాధికారి అప్పలనాయుడు

మద్దిలపాలెం: మద్దిలపాలెంలోని ఆర్టీసీ డిపోలో విజయవాడకు చెందిన దుర్గా ఆటోమెటివ్ సౌజన్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి కూలర్‌ను జిల్లా ప్రజా రవాణాశాఖాధికారి బి.అప్పలనాయుడు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపోలో ఉద్యోగులు, కార్మికులు దాహార్తిని తీర్చేందుకు మంచినీటి కూలర్ దోహదపడుతుందన్నారు.

ఎంవీపీలో విస్తృతంగా వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ బాషా తదితరులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. స్టేషన్ పరిధిలోని పలు ముఖ్య కూడళ్లలో పోలీసులు వాహనాలను ఆపి తనిఖీ చేశారు. ముఖ్యంగా ఎంవీపీ కాలనీ సెక్టార్-12లోని ఉషోదయ కూడలిలో ఎంవీపీ ఎస్‌ఐ బాషా నేతృత్వంలోని బృందం క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించింది. బీచ్‌రోడ్డు, లాసన్స్‌బే కాలనీ మీదుగా జాతీయ రహదారి , నగరంలోకి వెళ్లే వాహనాలను ఆపి, వాటిని పరిశీలించారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతగా నిలిచిన జట్టుతో వీసీ, రిజిస్ట్రార్



రన్నర్‌గా నిలిచిన జట్టుతో వీసీ, రిజిస్ట్రార్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పరిపాలన భవన కార్యాలయాల సిబ్బంది మధ్య నిర్వహించిన క్రికెట్ పోటీల్లో నియాన్ గ్రీన్ కలర్స్ జట్టు విజయం సాధించింది. బ్లూ బ్లాస్టర్స్ జట్టు రన్నర్‌గా నిలిచింది. మంగళవారం జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ విజేతలకు, రన్నర్‌లకు బహుమతులు అందజేశారు. గ్రీన్ థండర్స్ మేనేజర్ డా.పి.వి.ఎస్.ఎన్.వి.సాంబమూర్తి, కెప్టెన్ పి.రాజేంద్ర ప్రసాద్, బ్లూ బ్లాస్టర్స్ మేనేజర్ ఆర్.శ్రీనివాస్, కెప్టెన్ కె.సంతోష్ కుమార్ , ఇతర క్రీడాకారులను అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనంజయరావు పాల్గొన్నారు.

పశువుల దాణా పథకం పోస్టర్ ఆవిష్కరణ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న గంటా తదితరులు

ఎంవీపీకాలనీ: పశువుల దాణా పథకానికి సంబంధించి గోడపత్రికను మంగళవారం తన నివాసంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. రాయితీపై పశుదాణా– రైతుకు ఇస్తోంది ధీమా పేరుతో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఈ గోడపత్రికను రూపొందించింది. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ ఈ పథకంలో 50 శాతం రాయితీతో పాడి రైతులందరికీ పశుదాణా అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ ఎస్.కరుణాకర్, ఉపసంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శోధన, పరిశోధన పుస్తకావిష్కరణ

సీతంపేట: గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ రచించిన శోధన, పరిశోధన పుస్తకావిష్కరణ కార్యక్రమం లంకపల్లి బుల్లయ్య కళాశాలలో మంగళవారం జరిగింది. ప్రొఫెసర్ కె.సి.రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలమోహన్‌దాస్ నేటి సమాజానికి అవసరమైన ఆలోచనాపరుడు, తత్వవేత్త అని కొనియాడారు. బాలమోహన్‌దాస్ రచించిన సంకలనంలో విభిన్న రంగాలకు సంబంధించిన విషయాలను కూలంకషంగా పొందుపరిచారని తెలిపారు. రచయిత తన కెరీర్‌లో అనుసరించిన సూత్రాలను ఈ సేకరణలో పొందుపరిచినట్లు తెలిపారు. సభాధ్యక్షుడు, బుల్లయ్య కళాశాల సెక్రటరీ జి. మధుకుమార్ మాట్లాడుతూ బాలమోహన్‌దాస్ సమాజాన్ని మేధోసంపత్తితో సుసంపన్నం చేసే దిశగా వ్యాసాలను పొందుపరిచి విలువైన సంపుటిగా తీర్చిదిద్దారని కొనియాడారు. భవిష్యత్ తరాలకు ఈ వ్యాసాలు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. బొబ్బిలి రాజా కళాశాల మాజీ ఆంగ్ల విభాగాధిపతి వినయభూషణరావు పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఆండాల్ అమ్మిశెట్టి తదితరులు పాల్గొన్నారు.